స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

విశాలాంధ్ర-పలాస : రైలులో చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. శనివారం పలాస రైల్వే జీఆర్పీ పోలీసు స్టేషన్ లో ఎస్ఐ షరీఫ్ విలేకర్లతో మాట్లాడుతూ రైలు ప్రయాణీకులు మొత్తం 18 మంది తమ సెల్ ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేసారని, తమ సిబ్బంది. నిరంతరం నిఘా పెట్టి దొంగలను పట్టుకోవడంతో పాటు ఫోన్లు స్వాధీనం చేసామన్నారు. ఈ మేరకు బాధితులకు వాటిని అప్పగించామన్నారు. వీటి విలువ సుమారు రూ.5.04 లక్షలు ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్లు స్వాధీనం చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు హెచ్‌సి కోదండరావు, ఎం.సంతోష్కుమార్, పి.రమేష్, దేవేంద్రనాథ్. టి.తేజ, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఒక ఆడ పిల్ల తండ్రిగా ఆవేదన గురయ్యా...

- డా.అప్పలరాజు వేధింపులు శృతిమించాయి
- మాజీ మంత్రి గౌతు శివాజీ

విశాలాంధ్ర-పలాస: మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు చేపట్టినప్పటి నుంచి ఆడ పిల్ల అని చూడకుండా తన కుమార్తె గౌతు శిరీషను టార్గెట్ చేస్తూ చేసిన వేధింపులు శృతిమించాయని, తాను ఒక రాజకీయ నాయకుడుగా, శిరీష తండ్రిగా ఎంతో ఆవేదనకు గురి అయ్యానని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు.శనివారం పలాస టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గౌతు శిరీష పై తప్పుడు ప్రచారం, తప్పుడు పోస్టులు పెట్టడంతో నాతో పాటు భార్య విజయలక్ష్మి, శిరీష ఎన్నో రోజులు పాటు కన్నీరు పెట్టుకున్నామని, అయితే అన్నింటికీ ఎదుర్కొని వైసీపీ అభ్యర్థి అప్పలరాజు పై శిరీష విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. ఓటమి చెందిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి, పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు అప్పుడే అబద్ధాలు ప్రారంభించారని, ప్రజలు గుణపాఠం చెప్పినా వీరిలో మార్పు రాలేదని ఎద్దేవా చేసారు. తన కుమార్తె శిరీష విజయం తన రాజకీయ జీవితంలో చూడలేదని, బ్రతికున్నంత కాలం తనకు ఈ విజయం గుర్తుండిపోతుందని సంతోషాన్ని వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో జనసేన నేత పవన్ కళ్యాణ్ మ్యాన్‌ఆఫ్ మ్యాచ్‌గా నిలిచారని కొనియాడారు. దారి తప్పిన వ్యవస్థను అధినేత చంద్రబాబానాయుడు హయాంలో గాడిలో పెడతారని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత ఆయన తీసుకుంటారన్నారు. పలాసలో కిడ్నీ ఆసుపత్రి ఏర్పాటు ఆలోచన చంద్రబాబు నాయుడుదేనని, అక్కడ స్థలాన్ని కూడా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంపిక చేసి శంకుస్థాపన చేస్తే మంత్రి తన ఖాతాలో జమచేసుకోవడం సిగ్గుచేటన్నారు. కిడ్నీ ఆసుపత్రి ప్రస్తుతం డయాలసిస్ కేంద్రంగానే నడుస్తుందని, పరిశోధన చేసేందుకు ఒక్క పరికరమైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. తన హయాంలో ప్రారంభించిన డయాలసిస్ కేంద్రం పరికరాలు ఆసుపత్రిలో పెట్టి తన అభివృద్ధి అని అబద్దాలాడు తున్నారని ఏద్దేవా చేశారు. డా.అప్పలరాజు తన కుమార్తె శిరీషను ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టారని, రాష్ట్రంలో అంతటి నీచుడు ఉండడన్నారు. అతనికి ఇంతకన్నా పెద్ద శిక్షపడాలని ఒక తండ్రిగా కోరుకుంటున్నానని అన్నారు. పలాసను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తాను సహకారం అందిస్తానని శివాజి తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, యవ్వారి మోహనరావు, డొక్కరి శంకర్, కృష్ణ నాయక్, సాసుమాన చంద్రమౌళి, జోగ మల్లి, అంబటి కృష్ణమూర్తి, శశిభూషణరావు, పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోర్స్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో విద్యారంగంలో మారుతున్న పరిస్థితులు మరియు ఇండస్ట్రీలకు కావలసిన నైపుణ్యాలను దృష్టిలో వుంచుకుని, విద్యారంగంలో 40 సంవత్సరాల అనుభవంతో ఎప్పటికప్పుడు సరికొత్త కోర్సులు ప్రవేశపెట్టి డిగ్రీ విద్యలో ఒక ట్రెండ్ సెట్ చేయడం ఆదిత్యకే సొంతం అని కళాశాల డైరెక్టర్ బివిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ అని పేర్కొంటూ ఇందులో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్స్ (ఏపీఎస్-సీహెచ్ఈ) ఆధ్వర్యంలో సెంట్రల్ గవర్నమెంట్ పాలసీ అయిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలిసిస్ (సీఆర్ఐఎస్‌పీ) క్రింద అప్రెంటిసిషిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఈడీపీఎస్)లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో తమ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోర్స్ ప్రవేశ పెడుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులను ఇండస్ట్రీ నైపుణ్యాలకు తగ్గట్టుగా వివిధ సెక్టారులుగా విభజించటం జరిగింది, ఈ కోర్సులలో చేరిన విద్యార్థులకు మొదటి రెండు సంవత్సరాలు వారు ఎన్నుకున్న కోర్సులో ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టు సిలబస్ ను తయారుచేసి థియరీ మరియు ప్రాక్టికల్ క్లాసులు నిర్వహిస్తారు, ఫైనల్ ఇయర్ లో వీరిని ఎదో ఒక ఇండస్ట్రీకి పంపి అక్కడ అప్రెంటిషిప్ చేసుకొనే వీలు కల్పిస్తారు, ఈసమయంలో ప్రతీ విద్యార్థికి నెలకు రూ.7వేలు నుండి రూ.15వేలు స్టైఫండ్‌గా ఇప్పిస్తారన్నారు. అప్రెంటిషిప్ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు మంచి కంపెనీలో అత్యధిక ప్యాకేజీ తో ఉద్యోగం వస్తుందన్నారు అంతేకాకుండా విద్యార్థులు చదువుతో పాటు తాము ఎంచుకున్న రంగంలో ఉద్యోగం సాధించేలా తయారవ్వడం ఈ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని ఇంకా ఈ కోర్సుల కోసం మరిన్ని వివరాలు కొరకు 7997176661 ఫోన్ నెంబర్ కు లేదా శ్రీకాకుళంలోని అరసవిల్లి జంక్షన్ లో ఉన్న తమ కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో సంస్కారభారతి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటకు చెందిన సంస్కారభారతి డిగ్రీ విద్యార్థులు ఇటీవల విడుదలైన డిగ్రీ మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. బిఎస్సీ ఎంపీసీలో బెహర రేవతి (ఎంఎస్‌పల్లి) 9.30 పాయింట్లు, బొడ్డ ఆదర్శ్ (పెద్దకొజ్జిరియా) 9.13, కంబే నందు (కుసుంపురం) 9.13 పాయింట్లు, డొక్కరి రమ్య (మధుపురం) 9.0 పాయింట్లు, బిఎస్సీ, ఎంపిఎస్ఎస్‌లో దుద్ది భార్గవి (సోంపేట) 9.0 పాయింట్లు సాధించారు. అదే విధంగా 8.0 మరియు అంతకంటే ఎక్కువగా పాయింట్లు సాధించిన విద్యార్థులు 50మంది పైగా ఉన్నారు. ఇంతటి ఘన విజయాలు సాధించి 75 శాతం ఉత్తీర్ణత సాధించి డిగ్రీ కళాశాల అభ్యున్నతికి భాగస్వాములైన వారికి కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాయితీపై వరి విత్తనాలు

విశాలాంధ్ర-సోంపేట : 150 ఎకరాలకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా ఇంద్ర మరియు ఎంటియు 1318 వరి రకాల మూల విత్తనం అందుబాటులో ఉంచడం జరిగింది. మండలంలో మొత్తం 2300 ఎకరాలకు పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ, జనుము ఇది వరకే 50 శాతం రాయితీపై సరఫరా చేయడం జరిగింది. 5వ తేదీ నుంచి వరి విత్తనాలు జాతీయ ఆహార భద్రత మిషన్ రాయితీ కింద కేజీకి పది రూపాయలు చొప్పున ఇచ్చేందుకు రైతు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని ఈ సంవత్సరం స్వర్ణ, సాంబమసూరి వంటి తెగుళ్లకు గురయ్యే రకాలు విస్తీర్ణం తగ్గించడానికి ఎంటియు 1318, ఎంటియు 1224 అందజేస్తున్నామని, ఈరోజు వరకు మొత్తం వెయ్యి క్వింటాలు వరకు నమోదు పూర్తయ్యిందని రానున్న వారంలో విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేయనున్నామని చిన్న, సన్నకారు రైతులకు షెడ్యూల్ కులాలు తెగల రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ సహాయకులకు సూచించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి రైతుభరోసా కేంద్రాలకు చేరనున్న విత్తనాలన్ని మొలక శాతం పరిశీలించిన తర్వాతే రైతులకు అందజేయాలని సూచించారు. రైతులందరూ ముఖ్యంగా సన్నకారు రైతులు విత్తన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధైర్య పడొద్దు అండగా నేనుంటా

మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

విశాలాంధ్ర-రణస్థలం: మండలం పాతర్లపల్లి గ్రామంలో లావేరు మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సహకరించి ఓట్లు వేసిన ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజానీకానికి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలుకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండాలని, రానున్న రోజుల్లో కార్యకర్తలకు వారి కష్టసుఖాల్లో అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం సాగిద్దాం అని అందరం సమిష్టిగా పని చేద్దామని, కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని ఏ సమయంలో అయినా మీకు తోడుగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు అస్తమయం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మీడియా మొఘల్‌గా జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన అక్షర యోధుడు ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని జర్నలిస్టు సంఘాల నాయకులు కొంక్యాన వేణుగోపాల్, శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్‌లో ఉన్న రెవెన్యూగెస్ట్ లో రామోజీరావు సంతాప సభ శనివారం నిర్వహించారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సక్సెస్ గ్యారెంటీ అన్న పేరును రామోజీరావు తెచ్చుకున్నారని, ఓ చిరుద్యోగిగా తన జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన నేడు వేలాది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. 5000 ప్రతులతో ప్రారంభమైన ఈనాడు.. తెల్లవారేసరికి ఇంటి గుమ్మం వద్దకు చేరుకునే సరికొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. అప్పట్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పత్రిక చేరుకునేసరికి మధ్యాహ్నం అయ్యేదని చెప్పుకునేవారని, స్థానిక వార్తలకు జిల్లా ఎడిషన్ తీసుకురావడం ఈనాడుతోనే ప్రారంభమైందని తెలిపారు. ఆ తర్వాతి కాలంలో తెలుగునాట ఎన్నో పత్రికలు, దినపత్రికలు, మాసపత్రికలు వచ్చినా వాటన్నింటిని తట్టుకుని ఈనాడు నిలబడిందని వివరించారు. నేటి స్మార్ట్ యుగంలోనూ ఈనాడుకు దాదాపు 18 లక్షల సర్క్యులేషన్ ఉందంటే తెలుగు ప్రజలపై అది ఎంత ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. పత్రికా రంగంలో సక్సెస్ అయిన రామోజీరావు.. 90వ దశకంలో భారతదేశంలో మొదలైన టెలివిజన్ రంగంలోనూ అడుగుపెట్టారన్నారు. దీనిలో భాగంగా 1995లో ఈటీవీని స్థాపించారని ఇక్కడ విజయవంతం కావడంతో దేశంలోని మిగిలిన భాషల్లోనూ ఛానెల్స్ ప్రారంభించి అప్పట్లో అతిపెద్ద టెలివిజన్ నెట్‌వర్క్‌గా ఈటీవీని నిలబెట్టారని పేర్కొన్నారు. రామోజీరావుకు నివాళులర్పించిన వారిలో స్టార్ వాకర్స్ క్లబ్ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జి లక్ష్మి, మార్గదర్శి మేనేజర్ శ్రీనివాసరావు, జర్నలిస్టులు ఆకుల కృష్ణ, గొండు మణికుమార్, ప్రొఫెసర్ బలరాం, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నందిగాం: టెక్కలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావుకి సంతాప సభ తెలియజేశారు. రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటు అలుపెరగని అక్షర యోధుడని కన్నీటి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల లవకుమార్, వి చంద్రశేఖర్, మల్ల బాలకృష్ణ, ఇప్పిలి జగదీష్, జానకిరామ్, కూరాకుల యాదవ్, దల్లి ప్రసాద్, రెయ్యి ప్రీతీస్, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షల్లో సత్తాచాటిన కొత్తపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర-మందస : ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షల్లో మండలంలో కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికై సత్తా చాటారు. గత ఏడాది చదివిన నెయ్యిల భార్గవి, కోమటి జ్ఞానేశ్వరి, కుదళ్ల హితేష్, తెప్ప యామిని, తెప్పల అమృతలు ఉన్నారని, వీరి ఎంపికపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కిరణ్ కుమార్, జి.గోపాలకృష్ణలు ఉన్నారు.

ప్రజల హృదయాల్లో రామోజీరావు చెరగని ముద్ర వేశారు

- జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి: రామోజీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత రామోజీరావు మృతి పట్ల ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కవిటి ఎల్ ఎన్ మూర్తి కళ్యాణ మండపంలో రామోజీరావు చిత్రపటానికి లోల్ల రాజేష్ చేతుల మీదుగా పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధి,అంకితభావంతో కష్టించి పనిచేస్తే ఏదైనా సాధించవచ్చనడానికి రామోజీరావు జీవితం ఒక చక్కటి ఉదాహరణ అని అన్నారు.తెలుగు ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేశారని కొనియాడారు. జర్నలిజానికి ఓ గొప్ప గుర్తింపును కల్పించారని ఆయన రాసిన ప్రతి అక్షరం,వేసిన ప్రతి అడుగూ తెలుగుదనమే అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జన సైనికులు ప్రశాంత్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 13న మార్కెట్ ఆశీల వేలం పాట...

విశాలాంధ్ర-హిరమండలం: ఈనెల 13వ తేది గురూరం ఉదయం 11 గంటలకు హిరమండలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో హిరమండలం మార్కెట్ ఆశీల పాట నిర్వహించబడునని పంచాయతీ ఈఓ వై ఎస్ ఆర్ మూర్తి తెలిపారు, 2024-25సంత్సరం నకు సంబందించి 1,6,2024 నుంచి 31/3/2025 వరకు అనగా 10 నెలలు కాలం వరకు ఆశీలు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి గలవారు వేలం పాటలో 30 వేలు రూపాయలు నగదు 1 లక్ష రూపాయలు కు సాల్విని సర్టిఫికెట్ దాఖాలు చేసివేలం పాట లో పాల్గొవచ్చని తెలిపారు, సాల్విన్ సర్టిఫికెట్ దాఖాలు చేయని వారు నేరుగా 1లక్ష 30 వేలు రూపాయలు ధరవాత్తు చెల్లించి వేలం పాట లో పాల్గొవాలని పత్రికా ప్రకటన ద్వారా కోరారు.

తెలుగుకు వెలుగులు దిద్దిన రామోజీరావు

- శ్రీకాకుళం ఎంఎల్‌ఏ సతీమణి గోండు స్వాతి శంకర్
- రామోజీరావుకు టీడీపీ నేతల నివాళి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : తెలుగుకు వెలుగులు దిద్దిన మహను బావుడు రామోజీరావు అని, ఆయన మరణం తీరని లోటని శ్రీకాకుళం ఎంఎల్‌ఏ సతీమణి గోండు స్వాతి శంకర్ అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు మృతిపట్ల ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు గోండు స్వాతీ స్వాతీ శంకర్ శనివారం నివాళి అర్పించారు. విశాఖ ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో రామోజీరావు రామోజీ చిత్ర పటానికి టీడీపీ నేతలతో కలసి పూలమాలలు వేసి, అనంతరం మౌనం పాటించి స్వాతి శంకర్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్రిక, మీడియా రంగాలకు రామోజీరావు దిక్సూచి వంటివారన్నారు. జర్నలిజంలో విలువలు పాటిస్తూ సుదీర్ఘ ప్రస్థానం సాగించడంలో అయనను మించినవారు లేరని కొనియాడారు. అయన లేని లోటు పత్రికరంగానికి పూడ్చలేనిదన్నారు. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ ఇంచార్జిలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జీడి పిక్కల ధరను ప్రకటించాలి : జీడి రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : 80కేజీల జీడిపిక్కల ధర ప్రస్తుతం ఎంత ఉందో జీఎస్‌టి అధికారులు గాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ గాని జీడి వ్యాపారుల సంఘం నాయకులు గాని అధికారికంగా ప్రకటించకపోవడంతో జీడి రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని వెంటనే వారు స్పందించి జీడి పిక్కల ధరలను అధికారికంగా ప్రకటించాలని జీడి రైతు సంఘం కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ కోరారు. శనివారం వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో మద్దు రాఘవులు అధ్యక్షతన జీడి రైతు సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి రైతులు ధర తెలియకపోవడంతో తమ పిక్కలను నష్టానికి అమ్ముకుంటున్నారని, సంబంధిత శాఖ పరిస్థితిని చక్కదిద్దాలని కోరారు. రైతులు తాము పండించే పంటను ధర నిర్ణయించకుండా రెండు మూడు నెలలకు బదులు అమ్మకాలు చేయలేదని పిలుపునిచ్చారు. అనంతరం ఈనాడు అధినేత రామోజీరావు మృతికి సభ్యులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కోనేరు గురయ్య, కుత్తుమ వినోద్, జోగారావు, కామేష్, బత్తిన లక్ష్మీనారాయణ, కొర్ల హేమారావు చౌదరి, లండ రామలింగం, తమ్మినేని భాస్కరరావు, పురుషోత్తం, మద్దిల రామారావు, పిట్ట చంద్రశేఖర్, బైపల్లి రామక్రిష్ణనాయుడు, డి.గజపతి, ఎస్.కామేశ్వరరావు, గిరిలు పాల్గొన్నారు.

80కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16వేల మద్దతు ధర కల్పించాలి

సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల

విశాలాంధ్ర-పలాస : 80కేజీల జీడిపిక్కల బస్తాకు 16వేల రూపాయలు మద్దతు ధర కల్పించాలని సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. శనివారం మండలం చిన్ననీలావతి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీడి రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని, జీడి రైతాంగాన్ని ఆదుకునే నాథుడు కరువైయ్యారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి 80కేజీల జీడిపిక్కల బస్తాకు 16వేల రూపాయలు మద్దతు ధర కల్పించాలని, పలాస కేంద్రంగా జీడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, విదేశీ జీడిపిక్కల దిగుమతిని ఆపాలని డిమాండ్ చేశారు. పలాస ప్రాంతాల్లో సుమారు 300 జీడి పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎస్టియు) జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, కోదండరామ్, అరుణోదయ రామారావు, వంకల పాపయ్యలు పాల్గొన్నారు.

తెదేపా యూత్‌కు క్రికెట్ కిట్ పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కింజరాపు నాయుడు అత్యధిక మెజారిటీతో ఫ్యాట్రిక్ సాధించి గెలుపొందిన సంగతి తెలిసిందే. కింజరాపు అచ్చం నాయుడు గెలుపుకు తీవ్ర కృషి చేసిన సంతబొమ్మాలి పంచాయతి లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకులకు సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు తంగి రమణ క్రికెట్ కిట్ ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పార్టీకి మద్దతుగా, అహర్నిశలు కృషిచేసి, తీవ్రంగా ప్రచారం చేసి అచ్చంనాయుడు గెలుపునకు దోహదపడిన యువకులకు కోరిన వెంటనే తాను తన సొంత నిధులతో క్రికెట్ కిట్‌ను అందజేయడం జరిగిందని తెలిపారు.

పునః ప్రారంభానికి పుస్తకాలు అందేనా?

- విద్యాధికారుల వద్ద ప్రణాళిక ఉందా
- మూతపడ్డ యన్టీ బుక్ స్టోర్
- నేటికీ చేరని పుస్తకాలు... - ఈ ఏడాది విద్యా కానుక ఉందా

విశాలాంధ్ర-ఆమదాలవలస: నూతన విద్యా సంవత్సరం ప్రారంభ మైన నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్త కాలు ఈ ఏడాది అందేనా అన్న అను మానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు విడతలుగా అన్ని మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాలతో పాటు ఏడు సామాగ్రి లతో ఉన్న విద్యా కానుక ఇట్లు నేటికీ మండల స్టాక్ పాయింట్ కి చేరుకోలేదు. 10వ తర గతికి గత ప్రభుత్వం సీబీఎస్ఈ సిల బస్గా మారుస్తూ అందుకు తగిన పుస్త కాలను పంపిణీ చేస్తున్నారు. అయితే కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం ఇంగ్లీ ష్ తో పాటు తెలుగును కూడా బోధిం చాలని అప్పట్లో ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు అదే ప్రభుత్వం రావడంతో విద్యా శాఖలో అలజడి మొదలైంది. ఇప్పుడు తెలుగు పాఠ్య పుస్తకాలు ముద్రణ కొత్తగా చేస్తారా లేక పాత పుస్తకాలని కొనసాగిస్తారా అనే వింత పోకడ లో విద్యాశాఖ ఉంది. దీనికి తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు వద్ద ప్లాన్ బి ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్నకు మౌనమే సమాధానంగా వస్తుంది. తదుపరి కొలువుదీరే ప్రభుత్వం ఆదే శాలు ఇచ్చినంత వరకు మండల స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలు గానీ విద్యా కానుక వస్తువులు కానీ అందించ కూడదన్న ఉన్న తాధికారు ల మౌఖిక ఆదేశాలు అన్ని విద్యాశాఖ కార్యాలయాలకు చేరే. దీంతో పాఠ శాలల పునః ప్రారంభానికి పాఠ్యపు స్తకాలు అందేనా అన్న అనుమానా లు వస్తున్నాయి. గత ఏడాది మిగిలి న పుస్తకాలను జిల్లా యాంటీ స్టాక్ పాయింట్ వద్దకు అన్ని మండల కేంద్రాల నుంచి అందించారు. ఇప్పు డు స్టాక్ పాయింట్ మేనేజర్ ను తొల గించారు, ఆ విధులను జిల్లా సర్వ శిక్ష అభియాన్ కు అందించారు. దీంతో పుస్తకాల పంపిణీలో కూడా జాప్యం ఏర్పడుతుంది. ప్రతియట ప్రభుత్వాలు పాఠశాలల పునః ప్రారం భానికి పాఠ్యపుస్తకాలు అందిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ఆచ రణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఇప్పటికే విద్యాశాఖ అధికా రులు తదుపరి ప్రభుత్వం అందించిన నిబంధనల మేరకు లిఖితపూర్వక ఉత్తర్వులు ఇచ్చేవరకు విద్యా కానుక పుస్తకాలు అందించడానికి వీలు లేద నే సమాచారాన్ని కాంప్లెక్స్ కేంద్రాలకు అందించారు. ఇప్పటికే పునః ప్రారంభ తేదీ అధికారికంగా ప్రకటన కాలేదు. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు ప్రారం బోనాటికి కనీసం పార్టీ పుస్తకాలేనా ఇచ్చే పరిస్థితి ఉందాఅన్న అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశా లలో విద్యార్థుల ప్రతిపాదత రోల్ నెంబర్ కు విద్యా కానుక కిట్లు వచ్చా యా లేదా అన్న స్పష్టత కూడా లేదు. మొదటి యూనిట్ పరీక్షల నాటికి సిలబస్ పూర్తి అయిన అన్న అను మానం కూడా ఉంది. ఇన్ని అవాం తరాల నడుమ సంవత్సరం ప్రారంభ మవుతుంది. విద్యాశాఖ అధికారుల వద్ద కార్యాచరణ ప్రణాళిక లేకపో వడంతో ఇటువంటి దుస్థితి ఏర్పడు తుందని అభిప్రాయం వ్యక్తం అవు తుంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలలు వారి వ్యాపారాన్ని పెంచు కుంటున్నాయి. ఇదిలా ఉండగా పాఠ శాలలో పునః ప్రారంభం, పుస్తకాల పంపిణీ సిలబస్ పై స్పష్టత లేని కార ణంగా ప్రైవేట్ పాఠశాల యాజ మా న్యాలు గ్రామాల్లో తిరిగి విద్యార్థులను సేకరించి ఆయా పాఠశాలలో చేర్పించుకుంటున్నారు. ఇది చూస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా ధృతరాష్ట్ర నీతి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పటికైనా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ విద్యకు ప్రాధా న్యత అందించి వారికి అందించా ల్సిన పాఠ్యపుస్తకాలు త్వరితగతిన అందించాలని విద్యార్థుల తల్లిదండ్రు లు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ ను వివరణ కోరిక ఇప్పటికే రెండు విడుదల పుస్త కాలు వచ్చాయని మరో రెండు విడ తల్లో పూర్తిస్థాయి పుస్తకాలు ఆది వారం నాటికి చేరుతాయని తెలి పారు. విద్యా కానుక కిట్లు, సీబీఎస్సీ, తెలుగు పాఠ్యపుస్తకాలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు రాలేదని వచ్చిన వెంటనే త్వరితగతిన అమ లు చేస్తామన్నారు.

పురంధరేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేసిన ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : ఎమ్మెల్యే గా గెలిపోంది మొదటి సారిగా ఢిల్లీలో ఎంపీ క్వాటర్స్ లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) కలిసి ఎంపీగా గెలిచిన సందర్భంగా పురందేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె కూడా ఎన్ఈఆర్‌కి తిరిగి శుభాకాంక్షలు తెలియజేశారు.

కిడ్నీ వ్యాధులతో వణుకుతున్న ఉద్దానం

విశాలాంధ్ర - పలాస : మూత్రపిండాల వ్యాధులతో ఉద్దాన ప్రాంతం వణుకుతోంది. అనేక మంది మృత్యువాత పడుతున్నా వీటి మూలాలు కనుగోన లేకపోతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధులతో ఉద్దానంలో వందలాది మంది మృతి చెందుతున్నారు. సుమారు 40 ఏళ్ళుగా కిడ్నీవ్యాధి తీవ్రత తీర ప్రాంత గ్రామాల్లో విస్తరించినా దానిపై ఆధ్యయనం చేసిన వైద్యులు కిడ్నీవ్యాధికి గల కారణాలను వివరంగా చెప్ప లేకుండా దాట వేస్తూనే ఉన్నారు. వ్యాధి సోకిన వ్యక్తులు ముందుగా భయాందోళనలకు గురి కావడంతో మృత్యువు సులువుగా వారిని కబళించేస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇచ్చాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం తదితర మండలాల్లో ఉన్నప్పటికీ కవిటి, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో అధికంగా కిడ్నీ వ్యాధులు విస్తరించి ఆయా మండలాలోని అనేక మంది పిట్టల్లా రాలి పోతున్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. డయాలసిస్ కోసం గతంలో దూర ప్రాంతాలకు వెళ్తున్న వ్యాధిగ్రస్తులను ఉపసమనం కలిగించేందుకు గత వైసీపీ ప్రభుత్వం పలాసలో 200 పడకల ఆసుపత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మించడంతో కొంత వరకు రోగులకు ఊరట నిచ్చింది. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి పలాసలో 200 పడకలతో కిడ్నీ పరిశోధన కేంద్రంను ప్రారంభించడంతో రోగులు కిడ్నీ ఆసుపత్రిలోనే డయాలసీస్ చేసుకుంటున్నారు. ఈ ఆసుపత్రిలో ఇంకా పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో కేవలం డయాలసీస్‌కే పరిమితమైందని నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తరువాత పరిశోధన కేంద్రంనకు అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించేందుకు చర్యలు తీసుకుంటారని కిడ్నీవ్యాధిగ్రస్తులు ఎదురు చూస్తున్నారు. అయితే కిడ్నీ వ్యాధి వ్యాప్తి చెందే కారణాలను అన్వేషించేందుకు గతంలో చెన్నై, అమెరికా, నేపాల్, హైదరాబాద్, విశాఖపట్టణం నుండి వైద్య బృందాలు ఉద్దాన ప్రాంతానికి వచ్చి కిడ్నీ వ్యాధిగ్రస్తుల రక్త నమూనాలు, మూత్ర నమూనాలు, మంచినీటి నమూనాలు సేకరించినా అసలు వ్యాధికి గల కారణాలు ఏమిటో తెలియజేయడంలో ఏ వైద్య బృందం కూడా సఫలీకృతం కాలేదు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో పలు మార్లు వైద్య బృందాలు వస్తూనే ఉన్నాయి. ప్రధానంగా రోగుల ఆహారపు అలవాట్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. అయితే ఉద్దాన తీర ప్రాంతంలో మత్స్యకారులు అధికంగా ఉప్పు చేపలు తినడం, జీడి మామిడి తోటలకు అనేక రకాల పురుగుల మందులు వాడకం చేయడంతో ఈ వ్యాధులు వస్తున్నాయని మొదట్లో ప్రజలు భావించినా మరో ప్రక్క కలుషితమైన నీరు వాడకంతో కూడా ఈ వ్యాధులు సంక్రమిస్తున్నాయని చెబుతున్నారు. ఉద్దానంలో ఏ పల్లెను కదిపినా కిడ్నీ వ్యాధిగ్రస్తుల కథలు విన్పిస్తున్నాయి. పలాస నియోజక వర్గంలోని బాతుపురం, బైపల్లి, అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు, మాకన్నపల్లి, గురుదాసుపురం, బొడ్డపాడు గ్రామాలకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్సలు పొందుతున్నారు. కిడ్నీ వ్యాధులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది లేని పోని అపోహలకు గురై మృత్యువాత పడుతున్నారు. ఉద్దానంలో వేలాది మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉండగా కేవలం వందల సంఖ్యలో వ్యాధిగ్రస్తులకు పింఛన్లు అందజేస్తూ చేతులు దులుపుకుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడే ప్రభుత్వం స్పందించి కిడ్నీ వ్యాధి నిర్మూలనకు, భవిషత్ తరాలు ఈ వ్యాధికి గురి కాకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

300 మందికి వైద్య పరీక్షలు రక్తదాన, వైద్య శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర - మెళియాపుట్టి : ఘనంగా వీరమహిళా జన్మదిన వేడుక సందర్భముగా మెలియాపుట్టి మండల కేంద్రంలో జనసైనికులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పాతపట్నం నియోజకవర్గ వీర మహిళా కొరికాన భవానీ జన్మదిన వేడుకలను మండల జనసైనికుడు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో జనసైనికులు ఘనంగా నిర్వహించగా ఆమె సోదరుడు డా. సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలో పాతతహశీల్దారు కార్యాలయ ఆవరణలో వైద్యశిబిరాన్ని ఏర్పరిచి సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సను అందించారు. అలాగే సుమారు 30 యూనిట్ల రక్తాన్ని జనసైనికులు దానం చేశారు. అనంతరం కేకును కత్తిరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు జనసైనికులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేస్తూ పాతపట్నం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సారథ్యంలో మరెన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజా సమస్యల పోరాటంలో భవిష్యత్తులో ఆమె వెంట నిలుస్తామని, జై జనసేన, జైజై జనసేన అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జనసైనికులు క్రాంతికుమార్, చంటి, ప్రసాద్, మణికంఠ, సత్యనారాయణ, చిన్న, మోహన్, బృంద, శ్యామ్, ఈశ్వరరావు, బీజేపీ పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త సలాన శరత్ కుమార్, మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి, యువత అధ్యక్షుడు బస్వ పరమేష్ రెడ్డి, ముల్లేటి శ్రీనివాసరావు, తదితర కూటమి నేతలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కావాలన్న కలిశెట్టి ఎంపీ అయ్యారు

విశాలాంధ్ర - కొత్తూరు : విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తను ఎంఎల్ఏ కావాలని అనుకున్నారు, గానీ ఎంపీ కావాలని ఎప్పుడు అనుకోలేదు. 2013లో పాతపట్నం టిడిపి ఇన్చార్జి గా ఉన్న కలమట వెంకటరమణ టీడీపీ కి రాజీనామా చేసి వైసిపి పార్టీలో చేరారు. అప్పుడు తనకు ఎంతో నమ్మకం ఉన్న ఏచ్చేర్ల నియోజిక వర్గానికి చెందిన ఆ పార్టీ యువనాయికులు కలిశెట్టి అప్పలనాయుడు కి పాతపట్నం టీడీపీ బాధ్యతలను ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అప్పగించారు. పార్టీ.ని పటిష్ట పరిచారు. క్యాడర్ ను నిలబెట్టారు. 2014 ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయాలని కలిశెట్టి భావించారు అయితే అనూహ్యంగా కాంగ్రెస్‌లో ఉన్న శత్రుచర్ల విజయరామరాజు టీడీపీ లోకి రావడం జరిగింది పాతపట్నం నుండి పోటీచేయాలని భావించిన శత్రుచర్ల మాటకు కాదనలేక పాతపట్నం పార్టీ అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో శత్రుచర్ల ను పార్టీ నిలిపింది. ఐతే ఆ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందింది ఈ పరిణామంతో కలిశెట్టి పాతపట్నం రాజకీయ్యాలుకు దూరంగా ఉన్నారు 2019 ఎన్నికల్లో కూడా ఏచ్చేర్ల నుండి టీడీపీ టిక్కెట్. పై కళా వెంకటరావు పోటీ చేశారు . ఇక 2024 లో పార్టీ ల పొత్తుల ప్రాప్తికి బిజెపి కి వెళ్ళింది పార్టీపై, అధినేత చంద్రబాబునాయుడుపై అచంచల విశ్వాసం గల కలిశెట్టి అప్పల నాయుడు కు విజయనగరం టీడీపీ ఎంపీ టిక్కెట్ అయనకు దక్కడం అనూహ్యంగా పార్టీ ప్రభంజనంలో 2 లక్షలపైగా ఓట్ల మెజార్టీతో ఎంపీగా కలిశెట్టి ఎన్నికైనారు. శాసనసభలో అడుగు పెట్టాలాన్న కలిశెట్టి అప్పల నాయుడు కల, ఇలా తేనెప్పుడు ఊహించని కలలు కనని పార్లమెంట్‌లో అడుగు పెట్టించింది.

ఎన్టీఆర్, యర్రంనాయుడు విగ్రహాలకు పలుచోట్ల పాలాభిషేకాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కోడ్ ముగియడంతో సంతబొమ్మాలి మండలంలో పలుచోట్ల స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ కేంద్రమంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు కింజరాపు ఎర్రం నాయుడు విగ్రహాలకు పలుచోట్ల తెలుగుదేశం పార్టీ నాయ కులు పాలాభిషేకాలు చేసి పూలమాలలు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంతబొమ్మాలి మేఘ వరం పంచాయతీ పాతమేఘవరం, తాళ్లవలస పంచాయతీ లక్ష్మీపురం, తాళ్లవలస నౌపడ చింతాడపేట రుంకు హనుమంతపురం, బోరుభద్ర, జగన్నాథపురం, నరసాపురం, దండు గోపాలపురం ఉమీలాడ ఎస్బిఐ కొత్తూరు పంచాయతీలతో పాటుతోపాటు పలు గ్రామాల్లో ఎన్టీఆర్, ఎర్రమనాయుడు విగ్రహాలకు పాలాభిషేకం చేసి శుభ్రపరిచి పూలమాలలు వేసి, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం రావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పంచాయతీలు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు దారిదీపం రామోజీరావు

విశాలాంధ్ర - కవిటి : అభ్యుదయ మార్గదర్శి,ఈనాడు పత్రిక సంస్థ చైర్మన్,రామోజీ గ్రూపు సంస్థల అధినేత, పద్మ విభీషణ్ చెరుకూరి రామోజీరావు(88) మృతి తెలుగుజాతికి తీరని లోటు అని ఓ మంచి వ్యక్తిని పత్రికారంగం, సినీ రంగం కోల్పోవడం నిజంగా బాధాకరమని బెలగాం తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నరు. ఈ సందర్భంగా మండలం లోని బెలగాం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభ ముందుగా రామోజీరావు చిత్రపటానికి అందరూ పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన ఆత్మ శాంతి కోసం మౌనం వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఒక జర్నలిజం సంస్థలు స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పించి,ఇతర వ్యాపార సంస్థలు, పరిశ్రమ, మార్గదర్శి, ఈనాడు టీవీలలో ఉపాధి కల్పించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. నీతి నిజాయితీ కలుపుకొని రాష్ట్ర ప్రజల కోసం ఎంతో కృషిచేసి, ఎన్నో కష్టాలను ఎదురింటిన మహాను భావుడని కొనియాడారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం, మనందరికీ తీరని లోటని అన్నారు. వారి ఆశయ సాధనాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జీవితములో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనప్పటికీ లెక్కచేయకుండా ఒక లక్ష్యంతో, పట్టుదలతో, ఉన్నత స్థానానికి చేరుకొని, తన సంస్థలను అత్యున్నత శిఖరాల్లో అగ్రగామిగా నిలబెట్టిన మహా వ్యక్తి రామోజీ రావు అని అన్నారు. ఆయన ఆశయాలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సదానంద రౌల్లో, బాసుదేవ్ రౌల్లో, సంతోష్ కుమార్ పట్నా యక్, మణిచంద్ర ప్రకాష్, రంగా రౌల్లో, రఘుపాత్రుని శ్రీనివాస్ పట్నాయక్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ఈనాడు గ్రూఫ్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పత్రికా రంగానికే కాదని తెలుగుజాతికి మహా విషాదకరమమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. ఆయన శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వ్యవహారిక భాషాలోనే పత్రికలు రావాలని గిడుగురామ్మూర్తి పంతులు అన్న మాటలను ఆయన నిజం చేసి సామాన్యుల చెంతకు పత్రికను తీసుకువచ్చిన ఘనత రామోజీరావుదేనన్నారు. వేలాదిమంది విలేకర్లును ఆయన సంస్థల ద్వారా తీసుకురావడం జరిగిందన్నారు. పత్రిక రంగంతోపాటు వ్యాపార రంగంలో కూడా ఆయన రాణించి ఎంతోమందికి జీవన బృతి కల్పించటమే కాక సామాజిక రంగంలో కూడా ఆయన చేయూత ఎంతైన ఉందన్నారు. ఆయన లేని లోటు తెలుగు ప్రజలకు తీరని లోటుయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ పెద్ద గోవింద్, చిన్నగోవింద్, రాంకుమార్, ముత్తురాజు, నర్సింగరావు, మెట్ట మోహన్, దేవాది సింహాద్రమ్మ, గంగు సుదర్శనరావు, నౌగాపు నాగరాజు, అనపాన శ్రీనివాస్, ఇరానీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాలి : ప్రముఖ ఈనాడు దినపత్రిక, రామోజీరావు ఫిలింసిటీ అధినేత చెరుకూరి రామోజీరావు మృతి చెందడంతో సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన సంతబొమ్మాలిలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీర్ భీమారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మండలంలో గల వివిధ పంచాయతీలు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రామోజీరావు చిత్రపటంవద్ద నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం నాటుకులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు.

పలాస : ఈనాడు దినపత్రిక అధినేత రామోజీ రావు మృతికి మాజీ మంత్రి గౌతు శివాజీ సంతాపం తెలిపారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామోజీరావు తన తండ్రి గౌతు లచ్చన్న తో పాటు తనతో ఎంతో సన్నిహితంగా ఉండేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పి విఠల్, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవి శంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు,చంద్రమౌళి, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు అస్తమయంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటచేసిన సంతాప కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బాయి నడుకుదిటి తేజ మాట్లాడుతూ నేటి మా యువతకు స్ఫూర్తి ప్రదాత పద్మవిభూషణ్ రామోజీ రావు అని పేర్కొన్నారు. ఆయన తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో ముప్పిడి సురేష్, లంక శ్యామల రావు, బెందు మల్లేష్, డీజిఎం ఆనందరావు, జగన్నాథం నాయుడు, పైడి అప్పల దొర తోటయ్య దొర, పిన్నింటి బానోజీ నాయుడు, భువనేశ్వర్ రావు, సంధ్యారాణి, రౌతు శ్రీనివాసరావు, బాలి, శ్రీనివాసరావు, అసిరి నాయుడు, కనకారావు, అన్నం నాయుడు, దన్నాన వంశీకృష్ణ, సూరాడ రాముడు, రామకృష్ణ, మజ్జి వెంకటరమణ, సంపతరావు నాగేశ్వరరావు, లంక అప్పలనాయుడు, దన్నాన సత్తిబాబు, నడుపూరు శీను, మండల రామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : పాత్రికేయులకు దారి దీపం లాంటి మహానుభావుడు రామోజీరావు. జర్నలిజం రంగంలో కొత్త పుంతలు తొక్కించి జవసత్వాలు కల్పించిన దార్శనికుడు ఆయన, అలాంటి మహానుభావుని నేతృత్వంలోని ఈనాడు దినపత్రికలో సుదీర్ఘ ప్రస్థానాన్ని సాగించడం అదృష్టంగా భావిస్తున్నానని సీనియర్ ఈనాడు రిపోర్టర్ వాండ్రంగి కొండలరావు శనివారం విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. 1976 నుంచి 2012 వరకు 36ఏళ్ల పాటు పొందూరు కంట్రిబ్యూటర్ గా పనిచేశారు. ఆయనను ఇప్పటికీ ఈనాడు మాస్టారు అని పిలుస్తుంటారు. రామోజీ ఏ సమావేశంలో పాల్గొన్నా సరే "వేగం మన వేదం", "పనిలోనే ఉంది విశ్రాంతి" అని పేర్కొని పాత్రికేయులకు దిశానిర్దేశం చేసేవారు.అన్ని ఎడిషన్ల ప్రతులను ఆయనే స్వయంగా పరిశీలించి ఆయా వార్తలు లేదా కథనాలపై రిమార్కులను స్వదస్తూరితో రాసేవారు, గుడ్ -నాట్ గుడ్ అని తెలుగులోనే రాసేవారు, ప్రాధాన్యత లేని వార్తలు ఆయన దృష్టికి వచ్చినప్పుడు "ఈ వార్త అవసరమా" అంటూ కామెంట్ రాసేవారు. ప్రతిభ కనబరిచిన విలేకరులకు బహుమతులను, కొన్ని సందర్భాల్లో యోగ్యతా పత్రాలను కేంద్ర కార్యాలయం నుంచి పంపేవారు. విలేకరులకు, సబ్ ఎడిటర్లకు మార్గదర్శకంగా ఉండేందుకు గాను అప్పట్లో ఈనాడు సమీక్ష, అక్షర, దివిటీ అనే అంతర్గత సంచికలను వెలువరించేవారు. ప్రస్తుతం గుణ పేరుతో ఆన్ లైన్ సంచిక ను ఇస్తున్నారు. అన్నింటికి మించి 1989 జనవరి 26 నుంచి జిల్లా అనుబంధాలను ప్రారంభించడం ఈనాడు చరిత్ర లో ఓ సువర్ణ ఘట్టం. ఇదో సాహసోపేతమైన నిర్ణయమని వేరేగా చెప్పనక్కర్లేదు.ఈ నవీన సంప్రదాయాలకు తెలుగు జర్నలిజంలో శ్రీకారం చుట్టింది రామోజీరావేనని సగర్వంగా చెప్పుకోవచ్చు.నేను రాసిన పరిశోధనాత్మక కథనాలకు ఆయన నుంచి యోగ్యతా పత్రాలను పొందే అవకాశం లభించింది.ఈనాడు వసుంధర పేజీలో హెచ్చు కథనాలను రాసినందుకు నాకు ప్రత్యేక బహుమతులు లభించాయి. 1991 మార్చి 20న విశాఖపట్నం ఎడిషన్ కార్యాలయంలో ఈనాడు ఛైర్మన్ రామోజీరావు నుంచి ఉత్తమ కంట్రిబ్యూటర్ అవార్డును పొందాను.ఈ సందర్భంగా ఆయన కాలం విలువ తెలిపే గోడ గడియారాన్ని, కాలాన్ని రికార్డు చేసే అత్యంత ఖరీదు చేసే కలంతో పాటు పుష్పగుచ్ఛం స్వయంగా అందజేసి వెన్నుతట్టి మరీ ప్రోత్సాహించారు.అప్పటి శ్రీకాకుళం డెస్క్ సారథి బెందాళం సర్వేశ్వరరావు నాకున్న అర్హతల ప్రాతిపదికపై ఈ అవార్డును సిఫార్సు చేసి తన పెద్ద మనసును చాటుకున్నారు.ఆ తరువాత రామోజీరావు విశాఖపట్నం ఎడిషన్ పరిశీలనకు వచ్చినపుడు నన్ను ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించడంతో పాటు అవసరమైన సూచనలను చేశారు.పరిశోధనాత్మక జర్నలిజానికి పెద్ద పీట వేయాలని పేర్కొన్నారు.అన్నారు, చెప్పారు అనే వార్తలు కొంత వరకు అవసరమైనప్పటికీ,కేవలం అలాంటి వార్తలతో పేజీలు నింపితే ప్రయోజనం లేదని పేర్కొన్నారు.సమాజంతో సత్సంబంధాలు ఏర్పరచుకొని అన్ని దినపత్రికల కన్నా నిరంతరం మనమే నెంబర్ వన్ గా ఉండే బాధ్యతను స్వీకరించాలని హితోపదేశం చేశారు.ఆయనతో ఓ పది నిమిషాలు మాట్లాడే అవకాశం నాకు లభించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈనాడు పాతికేళ్ల అక్షర యాత్ర(1974-1999)సావనీర్ 136వ పుటలో "ఈనాడు మాస్టారు" అనే శీర్షికతో నా గురించి ఓ మంచి కథనం ఇచ్చారు.ఆ అనుభూతిని ఎప్పటికీ మర్చిపోలేను. కాగా ఈనాడు సమీక్ష నూరవ సంచికలో బెస్ట్ కంట్రిబ్యూటర్ కాలమ్‌లో "సమాజ సేవకు అంకితమైన ఈనాడు మాస్టారు"అనే శీర్షికతో నాటి శ్రీకాకుళం డెస్క్ సీనియర్ సబ్ ఎడిటర్ డి.వి.రమణ రెండు పేజీల కథనాన్ని రాశారు.ఈ విధమైన ప్రోత్సాహం, మధురానుభూతి కేవలం ఈనాడు వల్లనే లభించిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇక ఆయన కొన్నేళ్లు పాటు నడిపిన తెలుగు వెలుగు మాసపత్రిక రచయితలకు ఎంతో ప్రోత్సాహమిచ్చేది. అయితే భారతి పత్రికలానే ఈ పత్రిక కూడా మూత పడింది.ఏమైనప్పటికీ తెలుగు భాషా, సంస్కృతులకు, ఈనాడు వికాసానికి,ప్రకాశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం.నన్ను ఇప్పటికీ అందరూ ఈనాడు కొండలరావు అనే పిలుస్తారు.పత్రికా రంగానికి విశిష్ట సేవలందించిన రామోజీరావు గొప్ప స్ఫూర్తి ప్రదాత అని కొండలరావు కృతజ్ఞతాపూర్వకంగా శ్లాఘిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మెళియాపుట్టి : పేద ప్రజల పక్షాన నిలిచిన మహోన్నత వ్యక్తి రామోజీరావుని కూటమి నేతలు, మండల పాత్రికేయులు అన్నారు. శనివారం ఉదయం ఈనాడు సంస్థల అధినేత చిరుకూరి రామోజీరావు మృతి చెందడంతో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి

నేతలు, మండల పాత్రికేయులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన ప్రస్థానం మరువలేనిదని, పేద ప్రజల పక్షాన నిలిచిన మహోన్నతమైన వ్యక్తని కొనియాడారు. తన అక్షరాలతో నూతన ఒరవడి చట్టి ప్రజా చైతన్యంను చేసిన వ్యక్తిని పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, పాతపట్నం నియోజకవర్గ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, పట్టుపురం ఎంపీటీసీ సభ్యులు నంబాల వెంకటరావు, సర్పంచి ప్రతినిధి వాసు, మాడుగుల రమణయ్య, జనసైనికులు దుక్క బాలరాజు, పరమేశ్వర్ రెడ్డి, పైడ్రాజు, మారం వెంకట్రావు, పాత్రికేయులు మురళి, మాధవరావు, నాగిరెడ్డి, చాను, క్రాంతి, భాస్కరరావు, తదితరులున్నారు.

రణస్థలం : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు ఇక లేరని తెలిసి, తనకు ఎంతగానో బాధ కలుగుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. తను ఈనాడు రిపోర్టర్‌గా సేవలందించినప్పుడు జీవిత పాఠాలను సిద్ధింపజేసిన ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ గౌరవనీయులు చెరుకూరి రామోజీరావు ఇక లేరని తెలియడంతో కలత చెందానని అప్పలనాయుడు చెప్పారు. ఈనాడులో గ్రామీణ ప్రాంతం నుంచి రిపోర్టర్ గా పనిచేసిన తనకు ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి అవార్డును చైర్మన్ ప్రకటించారని, ఈనాడు గ్రూప్ సంస్థల ఎండి కిరణ్ చేతుల మీదుగా ఇదే అవార్డును అందుకోవడం ఎంతో అనుభూతి కలిగించిందని, ఇలా తనకు చైర్మన్ ఎంతగానో ప్రోత్సహించారని అప్పలనాయుడు గుర్తు చేసుకున్నారు. వ్యక్తిగతంగా గ్రామీణ ప్రాంత విలేకరి విధుల నుంచి రాజకీయాలకు వచ్చిన తర్వాత, అదే ప్రేమాభిమానంతో నా కుటుంబ సభ్యులైన భార్య ప్రభా నాయుడు, కుమార్తె నిఖిలను తనతోపాటు వారిని కూడా చైర్మన్ ఆశీర్వదించిన మధుర జ్ఞాపకాలు తలుచుకున్న ప్రతిసారి కన్నీరు పెట్టిస్తున్నాయని అన్నారు. చైర్మన్ ఛాంబర్ లో తాను అడుగుపెడుతున్నప్పుడు, అక్కడున్న సిబ్బంది తమ పట్ల చూపిన ప్రేమాభిమానం అనుభవిస్తున్నప్పుడు.. చైర్మన్ గారు ఎలాంటి విలువలు పాటించారో స్పష్టమైందని అప్పలనాయుడు చెప్పారు. అలాగే వారిని (చైర్మన్) ఢిల్లీలో స్వర్గీయ ఎర్రం నాయుడు కుమార్తె వివాహం రిసెప్షన్ లో కలిసినప్పుడు, వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్న సమయంలో చైర్మన్ స్పర్శ తనలో మరింత శక్తివంతమైన ఆలోచనలు కలిగించాయని అప్పలనాయుడు వివరించారు. ఈనాడు సమీక్షల ద్వారా పాత్రికేయ మిత్రులకు అందించిన సూచనలు, సలహాలు ఎంతో మంది మంచి పాత్రికేయుల్ని, సమాజం పట్ల ఎంతో మంచి బాధ్యత కలిగిన పౌరులుగా ప్రేరణ కలిగించాయని అన్నారు. వారి సంస్థలో పని చేసేటప్పుడు ఈనాడు ఈటీవీ (అన్నదాత)లకు సేవలందించినప్పుడు వారు అందించిన పారితోషకంతో ఆదా చేసుకుంటూ.. మొదటిగా వ్యవసాయదారుడు గా అప్పట్లో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశానని అన్నారు. ఇప్పటికీ ఆ భూమిలో వ్యవసాయం సాగు చేసుకున్నానని అన్నారు. అలాగే తొలిసారిగా నా జీవితంలో మార్గదర్శి చిట్స్ ఫండ్ లో ఆదా చేసి, ఇలా పొదుపు చేయగా వచ్చిన నిధులతో మరికొంత భూమిని కొనుగోలు చేసి, ఈరోజు స్వేచ్ఛగా, నిజాయితీగా కుటుంబ జీవనానికి అవసరమైన వనరుల్ని సమకూర్చుకున్నానని అప్పలనాయుడు చెప్పారు. ఈ రోజున వారు ఇచ్చిన ఆదర్శమైన సూచనలు, సలహాలు, నిబద్ధత, వారు సంస్థల నుంచి వచ్చిన ఆదాయ వనరులు ఈరోజు సమాజానికి, తన వ్యక్తిగత అవసరాలకు ఉపయోగపడ్డాయని గుర్తు చేసుకున్నారు. ఇలా తన జీవితానికి మార్గదర్శనం చేసిన చైర్మన్ కి జీవితాంతం రుణపడి ఉంటాను అని అప్పలనాయుడు అన్నారు.

అరసవల్లి : బహుముఖ ప్రజ్ఞాశాలి, అక్షర యోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలోని ఆయన చాంబర్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి శనివారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు ఇక లేరనే వార్త ఆవేదన కలిగించిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనమేనని పేర్కొన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారని, ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారని పేర్కొన్నారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదు... ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియజేస్తుందని వివరించారు. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారని స్పష్టం చేశారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సాధించారన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ ను వేదికగా చేశారని, మీడియా మొఘల్ గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారని అక్షర యోధుడు రామోజీ రావు అస్తమయం తెలుగు ప్రజలందరినీ కలచి వేస్తోందని చెప్పారు. ఆయన స్ఫూర్తిని పాత్రికేయులు అందిపుచ్చుకోవాలని, రామోజీరావు కుటుంబానికి నా తరపున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.